జిఒ 1పై హైకోర్టు తీర్పు అభినందనీయం

ప్రజాశక్తి-పాడేరు:రాష్ట్రంలో కూడళ్ళు, బహిరంగ ప్రదేశాల్లో రోడ్డు షోలు, సభలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జివో 1ను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయకుండా రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను నిరంకుశంగా అణచి వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జివో 1కి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని అన్నారు. అయినా ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడకుండా మరింత పటిష్టంగా జివోను అమలు చేయాలని చూసిందన్నారు. మంత్రుల పర్యటనల పేరుతో ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు విపరీతంగా పెరిగి పోయాయని అన్నారు. ప్రజల నిరసనలను లెక్క చేయని వైసిపి ప్రభుత్వానికి ఈ తీర్పు చెంపపెట్టు లాంటిదని ఆయన వ్యాఖ్యానించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పోకడలు విడనాడి పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే చర్యలు చేపట్టాలని హితవు పలికారు.

గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సుమిత్ కుమార్

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ ముందిరంలో జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాసు, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవలతో కలిసి స్పందనలో భాగంగా 65 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించలేదని అర్జీదారులు రెండ సారి స్పందనకు రాకుండా అధికారులు వారి ఇళ్లకు వెళ్లి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి.అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఐ.కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్.ఎం. రాజు, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, పి.హెచ్.ఓ. ఎన్.అశోక్, ఐటిడి ఏ పరిపాలనాధికారి హేమలత, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ లీలాకృష్ణ, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, పాడేరు తహశీల్దార్ వి.వి. త్రినాధరావునాయుడు, హుకుంపేట తహశీల్దార్ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన కొన్ని వినతులు....

పాడేరు మండల కేంద్రం తలారిసింగి హెలిప్యాడ్ వద్ద ఉన్న మినీ స్టేడియంను అభివృద్ధి చేయాలని ఫిజికల్ డైరెక్టర్లు టీ.సద్దు, పి.సూరిబాబు, జి.మన్మధరావు తదితరులు వినతి పత్రం సమర్పించారు. ముంచింగుట్టు మండలం కించాయిపుట్టు, గుమ్మసిరసాపుట్టు గ్రామాలకు తాగునీటి సదుపాయాలు కల్పించాలని, ముంచంగి పుట్టు మండల కేంద్రం ఆర్ఎస్ కార్యాలయం ముందున్న ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని, అక్రమణలకు గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం ఉపాధ్యాక్షులు ఎం.ఎం. శ్రీను వినతిపత్రంలో కోరారు.

నినాదాలు చేస్తున్న సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని
104 సిబ్బంది నిరసన

ప్రజాశక్తి -పెదబయలు రూరల్: సమస్యలను పరిష్కరించాలని 104 వాహన ఉద్యోగుల యూనియన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యప్తంగా నిరసన కార్యక్రమంలో బాగంగా శుక్రవారం పెదబయలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 104 సిబ్బంది నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా 104 సిబ్బంది మాట్లాడుతూ, ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ అమలు చేయాలని , 104 ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు రూ 26000 ఇవ్వాలన్నారు. , ప్రతినెలా మొదటి తేదీన జీతాలు చెల్లించాలన్నారు., పిఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చ్టేయాలన్నారు.

సంఘటనా స్థలంలో దొరికిన పేలుడు సామగ్రి, ఇతర వస్తువులు

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

ప్రజాశక్తి -చింతూరు

మావోయిస్టు మృతదేహం

చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా, కేర్లపాల్ పోలీస్ స్టేషన్ పరిధి సిరిసిట్టి అటవీ ప్రాంతంలో శుక్రవారం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య భారీగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో ఒక మావోయిస్టు మృతి చెందారు. అనంతరం ఘటనా స్థలంలో పోలీసులు పరిశీలించగా భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, వైర్లు, వాకీటాకీలు లభ్యమయ్యాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా మోదకొండమ్మ పల్లకి సేవ

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు

పల్లకి ఊరేగింపులో ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఫాల్గుణ

ప్రజాశక్తి-పాడేరు:పాడేరులో వెలసిన మోదకొండమ్మ అమ్మవారి జయంతి పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. పట్టణంలోని అమ్మవారి భక్తులు ఆలయం వద్ద బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. పాడేరు అరకు శాసనసభ్యులు కె. భాగ్యలక్ష్మి, శెట్టి ఫాల్గుణ అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకిలో ఉంచి పాడేరు పట్టణ వీధుల్లో ఊరేగించారు. అమ్మవార్ల వేషాలు డప్పు వాయిద్యాలతో అమ్మవారి పల్లకి సేవ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటగుల్లి సింహాచలం నాయుడు, గౌరవ అధ్యక్షులు తమర్బ నర్సింగ్‌రావు, కొత్తగుల్లి సుబ్బారావు, సర్పంచ్ ఉషారాణి, ఉత్సవ కమిటీ నాయకులు పిన్నయ్యదొర ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.మోద కొండమ్మ జాతర మహోత్సవాన్ని ఈనెల 14,15,16 తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నామని, జాతరకు రావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు పాడేరు శాసన సభ్యురాలు, ఆలయ కమిటీ అధ్యక్షురాలు కె.భాగ్యలక్ష్మి ప్రత్యేకంగా ఆహ్వానించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఓ పి.అంబేద్కర్‌లకు ఆహ్వాన పత్రికలను అందజేసి జాతరకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోదమ్మను దర్శించుకున్న సినీ డైరెక్టర్

గీత గోవిందం. సర్కారు వారి పాట వంటి హిట్ సినిమాల దర్శకుడు పరుశు రాం శుక్రవారం తన కుటుంబ సభ్యులతో కలిసి పాడేరులో అమ్మవారి ఆలయాన్ని సందర్శించి మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రతి ఏడాది తాను మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుంటానని ఆయన తెలిపారు. త్వరలోనే తాను రెండు భారీ సినిమాలకు దర్శకత్వం వహించబోతున్నట్లు ప్రకటించారు కార్తి హీరోగా తాను నిర్మించబోయే ఒక సినిమా అల్లూరి జిల్లాలోనే షూటింగ్ జరిపేందుకు ప్లాన్ చేస్తున్నామని ఆయన తెలిపారు.

సాంప్రదాయ నృత్యాలు చేస్తున్న కళాకారులు

రీ సర్వే చేపడుతున్న రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్న రైతులు

భూముల రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని చూచిరేవుల గూడెం, జగ్గవరం పంచాయతీల పరిధిలో గిరిజనులు సాగులో ఉన్న భూములకు సమగ్ర రీ సర్వేను శుక్రవారం ఆయా పంచాయతీ సర్పంచ్‌లు తెల్లం నిరోష, కారం పార్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 ఏళ్లగా గిరిజనుల సాగులో ఉన్న అసైన్మెంట్ భూములకు పట్టాలు ఇచ్చే దిశగా ఈ సర్వే జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి జెసిఎస్ కన్వీనర్ ఆవుల మరియదాసు, రెవెన్యూ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పట్టుబడిన నిందితులతో పోలీసులు

75 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-అనంతగిరి:అరకు మెయిన్ రోడ్డు, అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పోలీసులు 75 కిలొాల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాహనములు తనిఖీ చేస్తుండగా గురువారం ఉదయం అరకు నుండి ఎస్‌కోట మైదాన ప్రాంతానికి కొందరు వ్యక్తులు కారులో గంజాయి తరలిస్తున్నారు. 75 కేజీల గంజాయి అనంతగిరి పోలీసులు పట్టుకొని, కారు, పైలట్‌గా వస్తున్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరకు మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. అనంతరం విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించామని ఎస్ఐ రాము తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గంజాయి అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-పెదబయలురూరల్:కిముడుపల్లి పంచాయితీ గ్రామాలలో గిరి రైతులు, యువకులకుస్థానిక ఎస్ఐ మనోజ్ కుమార్, తహసిల్దార్ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో గంజాయి సాగు, రవాణాతో కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మనోజ్ కుమార్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణాకు యువకుల పైలెట్‌లు వంటివి చేయకూడదని సూచించారు. గంజాయి సాగు చేస్తే రైతులను బైండోవర్ చేయడం జరుగు తుందన్నారు. యువకులు గంజాయి కేసులో పట్టుబడితే ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి అర్హత లేకుండా ఉంటారని తెలిపారు. వీటికి దూరంగా ఉండాలన్నారు.

ధర్మకు అవార్డు

ప్రజాశక్తి -దుంబ్రిగూడ: మానవ హక్కుల నేర నిరోధక సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మకు దువ్వాడలో ఆ సంఘం జాతీయ నాయకుల సమావేశంలో శుక్రవారం ఉత్తమ అవార్డును అందజేసి ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో నిరుద్యోగ యువత గంజాయి, నాటు సారా, మద్యంతో పాటు పలు మత్తు పానీయాల జోలికి పోకుండా ఉండేందుకు హలో అవగాహన కార్యక్రమాలు ఆయన నిర్వహించారు. వీటితోపాటు నిరుపేదలైన గిరిజనులకు చీరలు, దుప్పట్లు, ఉచిత బియ్యం వంటి పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. వీటిని గుర్తించిన ఆ సంఘం జాతీయ నాయకత్వం ఆయనకు అవార్డును అందజేసినట్లు స్థానిక విలేకరులకు తెలిపారు.

అవార్డు స్వీకరిస్తున్న ధర్మ

వారసులకు అందని పోలవరం ప్యాకేజీ

- ఆందోళనలో మరణించిన వారి కుటుంబాలు
- భయం గుప్పెట్లో ముంపు గ్రామాల ప్రజలు

వరదల సమయంలో ఎత్తైన ప్రాంతంలో గుడారాలు వేసుకొని నివాసముంటున్న నిర్వాసితులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి నుండి చిన్నచూపే చూస్తున్నాయి. ప్యాకేజీ, పునరావాసం అమలు విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రభుత్వం, మరణించిన నిర్వాసితుల కుటుంబాల వారసులకు పోలవరం ప్యాకేజీ అమలు చేయడం లేదు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి అనేక సర్వేలు నిర్వహించి నిర్వాసితులను గుర్తించగా, చివరి గ్రామసభల సమయానికి పిడిఎఫ్ కుటుంబ యజమానులు కొందరు మరణించారు. ఇలా మరిణించిన వారి వారసులకు ఆ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉండగా, అది అమలుకు నోచకోవడం లేదు. దీంతో మరణించిన వారి వారసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పోలవరం ప్రాజెక్ట్ కారణంగా సర్వం వదులుకొని పునరావాస కాలనీలకు వెళుతున్న నేపథ్యంలో మరణించిన వారి కుటుంబాల వారసులకు ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించి ఆదుకోవాలని సిపిఎం నాయకులు, నిర్వాసితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ముంపు గ్రామాల ప్రజల్లో భయాందోళన

గోదావరి వరదల భయం ముంపు గ్రామాల ప్రజలను ఇంకా వీడలేదు. ఇక్కడి నిర్వాసితులను ఎప్పటిలోగా పునరావాస కాలనీలకు పంపుతారో అంతుపట్టని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది కూడా వరదలొస్తే మళ్లీ కొండలు, గుట్టల పాలు కావాల్సిందేనా? అంటూ ఆందోళన చెందుతున్నారు. గిరిజన, గిరిజనేతర నిర్వాసితులకు ఏలూరు జిల్లా తాడ్వాయి ప్రాంతంలో పునరావాస కాలనీలు నిర్మించారు. ఇంకా కొన్ని గ్రామాల వారికి ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. అలాంటిది ఈ ఏడాది జూన్ నాటికి పునరావాస కాలనీలకు ఎలా పంపిస్తారన్న సందిగ్ధత నిర్వాసితులోల నెలకొంది. ఈ ఏడాది కూడా భారీగా వరదలు వస్తే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన చెందుతున్నారు.

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-విఆర్ పురం

మోడీ నాయకత్వంలో కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలందరూ ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పచ్చి మతోన్మాద విధానాలతో కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. మేక్ ఇన్ ఇండియా అంటూనే ప్రభుత్వ రంగ పరిశ్రమలు, సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందని, ప్రజల సంపదైన బిఎస్ఎన్ఎల్, ఓడరేవులు, విశాఖ స్టీల్‌ప్లాంట్, ఎల్ఐసిని దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని తెలిపారు. ఒకే దేశం, ఒకే పన్ను పేరుతో తీసుకొచ్చిన జిఎస్‌టి తీసుకొచ్చి ప్రజలపై మరిన్ని భారాలు మోపుతుందన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంచి ప్రజలు నడ్డి విరుస్తుందని చెప్పారు. మరో వైపు తన మతోన్మాద విధానాలతో ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందన్నారు. గిరిజన చట్టాలను సవరిస్తూ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే ప్రయత్నం చేస్తుందని, దానికి అనుగుణంగా కార్పొరేట్ ఫారెస్ట్ విధానాన్ని ముందుకు తీసుకొస్తుందని తెలిపారు. బిజెపికి ప్రజలందరూ ఐక్యంగా బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ఆదివాసీలను బలహీనపర్చడానికే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం 52 జీవో ద్వారా బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో కలపాలని చూస్తుందని దుయ్యబడ్డారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి చిన్నబాబు

దోమల నివారణ మందు పిచికారీ పనులను పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి హిమబిందు

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దారకొండ ఆరోగ్య ప్రాథమిక కేంద్రం పరిధిలో మలేరియా నివారణకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాధుపాకల గ్రామంలో దోమల నివారణకు మందు పిచికారి చేశారు. దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు దోమల మందు పిచికారి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో బుధవారం నుంచి దోమల మందు పిచికారి జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబం గృహం లోపల, బయట దోమల మందును పిచికారి చేయించుకోవాలని సూచించారు. రంగు, వాసన ఉంటుందని గృహం లోపల దోమల మందు పిచికారికి కొందరు నిరాకరిస్తున్నారని, అది సరికాదని హితవుపలికారు. ప్రస్తుతం పిచికారి చేస్తున్న ఏసీఎం 5 శాతం మందు వాసన, రంగు ఉండదన్నారు. కేవలం దోమలపైనే ప్రభావం చూపుతుందని తెలిపారు. గిరిజనులు రాత్రి సమయంలో విధిగా దోమతెరలను ఉపయోగించుకోవాలన్నారు. దోమకాటుకి దూరంగా ఉంటే మలేరియా వ్యాధి నివారించుకోవచ్చని చెప్పారు. గ్రామాల్లో గిరిజనులు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మలేరియా నిర్ధారణ అయితే క్రమంగా మందులు వాడాలని కోరారు.

ప్రమాదకరంగా పోచవరం రహదారి

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రముఖ పర్యాటక కేంద్రం పాపికొండలుకు వెళ్లే పోచవరం ఆర్ అండ్ బి రహదారి ప్రమాదకరంగా ఉంది. నిత్యం పర్యాటకులు, పరిసర గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో వాహనాల్లో ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఉంటారు. ఈ దారిలో మండల కేంద్రానికి కూడా వెళ్తుంటారు. ఈ మార్గంలో పొదలు ఏపుగా పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా మలుపుల వద్ద పొదలు దట్టంగా ఉండడంతో వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బంది పడాల్సి వస్తోంది. మరో వైపు మూల మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టలేదు. కొన్ని ప్రాంతాల్లో రహదారి గోతులు పడ్డాయి. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు దృష్టి సారించి రోడ్డు మధ్యలో ఉన్నటువంటి గోతులు పూర్చాలని, ఆయా మూల మలుపుల వద్ద రోడ్డు అడ్డంగా మూసుకుపోయి ఉన్న పొదలను తొలగించాలని, అన్ని మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఉత్సాహంగా ఆటల పోటీలు

మ్యూజికల్ చైర్ ఆటలు ఆడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మంత్రిగూడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆటల పోటీలు ఎంతో ఉత్సాహంగా జరుగుతున్నాయి. గత నాలుగు రోజుల నుంచి అక్కడ విద్యార్థులకు మొదటి నుంచి రోజుల వారీగా కథల పుస్తకాలు చదివించడంతో పాటు వ్యాసరచన , పాటల పోటీలు, రన్నింగ్, మ్యూజికల్ చైర్ వంటి ఆటల పోటీలను నిర్వహించారు. వేసవి సెలవుల్లో చిన్నారులు బయటకు వెళ్లకుండా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతుంది. చిన్నారుల తల్లిదండ్రులు కూడా ప్రతిరోజు పిల్లలను గ్రంథాలయానికి పంపించి ఆటల పోటీల్లో చురుగ్గా పాల్గొనే విధంగా చూసుకుంటున్నారు. ఈ ఆటల పోటీలు చిన్నారుల మానసిక ఉల్లాసానికి ఎంతో దోహద పడుతున్నాయి. గ్రంథాలయ సిబ్బంది కూడా చిన్నారులకు దగ్గర ఉంటూ ఎంతో జాగ్రత్తగా నిర్వహించి తమ తమ ఇళ్ల వద్దకు తీసుకెళ్లి వదిలి పెడుతుండడంతో చిన్నారుల తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కు డైరెక్టర్ పర్సనల్‌కు అభినందన

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పర్సనల్ సురేష్‌చంద్ర పాండేను ఐఎన్‌టియుసి నేతలు నీరుకొండ రామచంద్రరావు, మంత్రి రాజశేఖర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు సంతకం చేసే వేతన ఒప్పందం జరగక ఎంతో మానసిక వేదనకు గురౌతున్నారని, త్వరితగతిన వేతన ఒప్పందం అమలు జరిగేలా చూడాలని కోరారు. మానవ వనరులు సక్రమంగా నిర్వహిస్తూ, స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దీనిపై డైరెక్టర్ పర్సనల్ సురేష్‌చంద్ర స్పందిస్తూ, కార్మికులు, యూనియన్లు, యాజమాన్యం కలిసి పనిచేస్తేనే కర్మాగారం లాభాల బాటలో పయనిస్తుందన్నారు.కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నేతలు కారు రమణ, ఎస్.ఎ.నాయుడు, నాయక్, సుబ్బయ్య, కొమ్ము ప్రసాద్, గోపీశెట్టి వెంకటరమణ, ప్రభాకర్‌రెడ్డి, పి.వి.రమణమూర్తి, రవి, జెర్రిపోతుల మోహన్‌కుమార్, సుదర్శన్, వెంకటరాజు, ఏఖవర్మ దేముడు, ఎంఎస్ ప్రసాద్, సుబ్బారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్యాబ్రికేషన్ పెయింటింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి -సీతమ్మధార : మహిళల స్వయం ఉపాధికి ఫ్యాబ్రికేషన్ పెయింటింగ్‌పై శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని బాలవికాస ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరంలో బాల వికాస ఫౌండేషన్ సేవా శిక్షణ శిబిరాల్లో భాగంగా ఫెవికాల్ సంస్థ సహకారంతో మహిళలకు ఐదు రోజుల శిక్షణను ప్రారంభించారు. ఫౌండేషన్ గడచిన 15ఏళ్లుగా ఇటువంటిశిక్షణను నిర్వహిస్తోందని గృహిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్క్‌షాప్ డైరెక్టర్ యామిని మాట్లాడుతూ, 30మందికి మాత్రమే శిక్షణకు అవకాశం ఉందని, ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి 12.30గంటల వరకు నిర్వహించే శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు 85200 04288 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, రమణ, డాక్టర్ బాబ్జి, అనూరాధ పాల్గొన్నారు

మలేరియా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : దోమలను నియంత్రించడం ద్వారా మలేరియా, డెంగీ, ఇతర దోమ కారక వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ మణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పించారు. నీటి నిల్వలోనే దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందుతాయని, ఇంటి లోపల, పరిసరాల్లో మురుగు,మంచినీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.ఎపిఎం బి.రంగారావు, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని జయప్రదం చేయండి

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సమావేశంలో నిర్ణయం

మాట్లాడుతున్న సుధాకర్

ప్రజాశక్తి -కంచరపాలెం : ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోడీకి రాసే పోస్టుకార్డు ఉద్యమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బిబి మూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్ఎడి దరి శాంతినగర్ హిస్సి భవన్‌లో బిబి మూర్తి అధ్యక్షతన నిర్వహించిన పెన్షనర్ల అసోసియేషన్ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్ మాట్లాడుతూ ఆల్ ఇండియా పెన్షనర్ల కోఆర్డినేటివ్ కమిటీ నిర్ణయం ప్రకారం పోస్ట్‌కార్డ్ ఉద్యమంలోఅందరూ పాల్గొనాలని కోరారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కె సుధాకరరావు మాట్లాడుతూ ఆల్ ఇండియా కోఆర్డినేటివ్ కమిటీ సమావేశం వచ్చేనెల 27న కేరళలో జరుగుతోందని, సమావేశానికి వచ్చే కార్యకర్తలు తమ పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు అక్కడి వెళ్లేందుకు ఇప్పుడే రైల్వే టిక్కెట్లను రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పెన్షనర్ల తాజా పరిస్థితులు, ప్రస్తుత రాజకీయాల పరిస్థితి విపులంగా వివరించారు.హయ్యర్ ఆప్షన్ ఆన్‌లైన్ చేసుకోవడంపై సమగ్రంగా వివరించారు. పోస్టు కార్డు ఉద్యమం అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బిజినెస్ అనలిటిక్స్‌పై గీతం ఎఫ్‌డిపి

శిక్షణలో మాట్లాడుతున్న దినేష్‌కుమార్

ప్రజాశక్తి- మధురవాడ : కార్పొరేట్ రంగంలో విశేష ప్రాధాన్యత ఉన్న బిజినెస్ అనలిటిక్స్‌పై శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి) నిర్వహించారు. బెంగళూరు ఐఐఎంకు అనుబంధంగా ఉన్న డేటా సెంటర్ అనలిటిక్స్ ల్యాబ్ నిపుణుడు ప్రొఫెసర్ యు.దినేష్‌కుమార్, శారదా శృంగేశ్వర పాల్గొని, అనలిటిక్స్ మిషన్ లెర్నింగ్ అంశాలపై అధ్యాపకులకు అవగాహన కలిగించారు.గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అనలిటిక్స్, ఫిన్‌టెక్ విభాగాధిపతి డాక్టర్ డి.విజయగీత మాట్లాడుతూ అనలిటిక్స్‌లో నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చాలన్న లక్ష్యంతో వాణిజ్యవిద్యను బోధించే అధ్యాపకులకు ప్రత్యేక అవగాహన తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. గీతం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ అమిత్‌భద్ర పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులు హాజరయ్యారు.

హెచ్‌సిఎల్ టెక్‌బి జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి -కంచరపాలెం. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సిఎల్ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన టెక్‌బీ ప్రవేశాలకు నిర్వహించిన జాబ్ డ్రైవ్‌లో 11 మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. ఇంటర్‌లో కనీసం 75శాతం మార్కులతోపాటు ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా 75మంది పాల్గొనగా, 11మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు.కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య, హెచ్‌సిఎల్ మేనేజర్ యు.అనిల్, క్లస్టర్ మేనేజర్ సాయికిరణ్, యుగేష్, విట్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ పట్నాయక్, టిపిఒ డాక్టర్ ఆడారి తులసినాయుడు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మల్లా రమేష్‌నాయుడు, డెడికేటెడ్ ఇఎస్ కోఆర్డినేటర్లు బండారు రామేశ్వరి, కాళ్లసంతోష్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయాలి

ప్రజాశక్తి -కొత్తకోట:కీటక జనిత వ్యాధులు రాకుండా గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయాలని హెల్త్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం సూచించారు. ముందు జాగ్రత్తగా దోమల నివారణ మందు ఎసిఎం 5శాతం మందు స్ప్రేయింగ్ చేయాలన్నారు. శుక్రవారం కొత్తకోట పిహెచ్‌సి పరిధిలో ధర్మవరం గ్రామంలో జరుగుతున్న స్ప్రేయింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరి గ్రామాలలో ఎక్కువగా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి గిరి గ్రామంలోనూ ఎసిఎం 5శాతం మందు స్ప్రేయింగ్ చేయించాలని హెల్త్ సూపర్వైజర్ మల్లిబాబుకు సూచించారు. దోమతెరలు వాడాలని, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా సమీప ఆరోగ్యకేంద్రానికి వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కె.వరహాలుదొర, సబ్ యూనిట్ ఆఫీసర్ మురళీకృష్ణ, హెల్త్ సిబ్బంది మల్లిబాబు, నాయుడు పాల్గొన్నారు.

సిబిఎస్ఇ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి -గాజువాక : సిబిఎస్ఇ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీనగర్‌కు చెందిన 'ఆపిల్ ఐ' ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ చైర్మన్ బలరామకృష్ణ తెలిపారు. మొత్తం విద్యార్థులు 54మంది పరీక్షకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారని, వీరిలో 51 మంది ప్రథమశ్రేణిలో పాసయ్యారన్నారు. వీరిలో 90 శాతానికి పైగా మార్కులు 13 మంది విద్యార్థులు సాధించారన్నారు. గడచిన ఎనిమిదేళ్లలో అత్యుత్తమ ఫలితాలను ఈ ఏడాది సాధించడంపై చైర్మన్ హర్షం వ్యక్తం చేసి, విద్యార్థులను అభినందిచారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం

అంబేద్కర్ గురుకులం టాపర్స్‌కు నగదు ప్రోత్సాహకాలు అందించిన మంత్రి నాగార్జున

చెక్కును అందజేస్తున్న మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -పిఎం పాలెం : ప్రతి విద్యార్థిలోని నైపుణ్యతను వెలికి తీయడమే జగనన్న లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శుక్రవారం కొమ్మాదిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి అభినందించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ టెన్త్ ఫలితాల్లో అంబేద్కర్ గురుకులాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం అందించే విద్యాపథకాలు సద్వినియోగం చేసుకొని, ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం అందించిన విద్యాపథకాలతో, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆసరాగా నిలిచి, ప్రోత్సాహించడం వల్లే ఇలా రాష్ట్రస్థాయి ర్యాంకుల సాధన సాధ్యమైందన్నారు. అనంతరం అంబేద్కర్ గురుకులాల్లో 589 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన కకివాడ గురుకులం విద్యార్థి పి.జోత్స్నకు రూ.లక్ష, 588 మార్కులతో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం కొమ్మాది గురుకులం విద్యార్థి యం.ప్రియాంకకు రూ.50 వేలు చెక్కును అందించారు. కార్యక్రమంలో గురుకులాల సెక్రటరీ పావనమూర్తి గారిచర్, జాయింట్ సెక్రటరీ శివరావు, డిసిఒలు చంద్రకళ, మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ నాగమణి, స్థానిక నాయకులు వాండ్రాశి రవికుమార్, బొట్ట అప్పలరాజు, సియ్యాద్రి కనకరాజు, కుడితి రామారావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం నీలిబంద గ్రామానికి ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు ఇచ్చి, పని కల్పించాలని శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పిత్రిగడ్డ శివారు గ్రామమైన నీలిబంద గ్రామంలో ఆరు కుటుంబాలు 25 మంది జనాభా కొందుతెగ చెందినటువంటి గిరిజనులు జీవనం సాగిస్తున్నారన్నారు. శరభవరం సచివాలయం పరిధిలో శివార గ్రామమైన 15కిలోమీటర్ల దూరం ఎత్తైన కొండల మధ్య జీవనం సాగిస్తున్నారన్నారు.

దట్టమైన అడవి మధ్యలో చీకట్లో బతుకు తున్నారన్నారు. వీరు ప్రధానంగా జీడిమామిడి తోటల పై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. గ్రామంలో కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయాలని, మంచినీరు కోసం రెండు కిలోమీటర్ల దూరం ఎత్తైన కొండల మధ్య కర్ర ఒక సాయంతో నీరు తెచ్చుకొని బతుకుతున్నారన్నారు. రేషన్ బియ్యంకు 15 కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామంలో ఇద్దరికి వృద్ధాప్య పెన్షన్లు ఇస్తున్నారని, నగదు తీసుకునేందుకు డోలు కట్టుకొని లోసింగి గ్రామానికి వెళ్లాలన్నారు. పనులు లేక పోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ గ్రామాన్ని సందర్శించి వీరికి ఉపాధి పథకం పనులు కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాన్ షెడ్యూల్ ప్రాంతం కావడంతో గిరిజనులంటే అధికారులు పట్టించుకోలేదన్నారు.ఇప్పటికైనా కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొర్ర కొండబాబు, కొర్ర కృష్ణ, గంబిల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆమ్‌ఆద్మీ నాయకులు

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలన్నింటినీ అమలు చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సీతల్ మదన్ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర ప్రభుత్వం చేసిన మోసంపై ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తొమ్మిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఈ విషయంలో కేంద్రాన్ని నిలదీయడంలో పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసే అధికారం బిజెపికి లేదని అన్నారు. కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో నడపాలని కోరారు. నిరసన కార్యక్రమంలో పార్టీ జిల్లా కన్వీనర్ సాహూ సంతోష్, కొణతాల హరినాథరావు పాల్గొన్నారు.

జివిఎంసి స్థాయీ సంఘంలో అన్ని అంశాలూ ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘంలోని 15 అంశాలు సభ్యుల ఆమోదం పొందాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థాయీ సంఘంలో మొత్తం 15 అంశాలను పొందుపరచగా అన్నీ ఆమోదం పొందాయని వెల్లడించారు. ఒకటి నుంచి 13వ అంశం వరకూ రెవిన్యూ విభాగానికి చెందిన మార్కెట్లు, దుకాణాలు, ఫలసాయాలు, కల్యాణ మండపాలు తదితర అంశాలు ఉండగా, వాటిని సభ్యులు ఆమోదించారన్నారు. 15వ అంశంలో ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సింహాచలం ఆర్టీసీ బస్టాండ్ అప్రోచ్ రోడ్డునకు బిటి బ్యాచ్ వర్క్ పనులు చేసేందుకు, ప్రజా ఆరోగ్య విభాగానికి చెందిన కుక్కలకు ఆహారం, టీకాలు, మందులు కొనేందుకు పరిపాలనపరమైన అనుమతిని కోరగా సభ్యులు ఆమోదించినట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతోపాటు ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఫణిరామ్, కార్యదర్శి నల్లనయ్య, జోనల్ కమిషనర్లు కనక మహాలక్ష్మి, శివ ప్రసాద్, కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోషి, ఎఎంఒహెచ్.కిశోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఖజానా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిఎఫ్ఎంఎస్ కేంద్రంగా కాకుండా విశాఖ జిల్లా ఖజానా కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో 84 ద్వారా జివిఎంసి ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ఎంఇఒ ద్వారా జీతాలు డ్రా చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినప్పటికీ గత నెల జీతాలు, బిల్లులు సమర్పించడంలో తలెత్తిన సాంకేతిక సమస్యలను సిఎఫ్ఎంఎస్ అమరావతి వారు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. తాజాగా భీమిలిలో తలెత్తిన సమస్యను వారు వివరించారు. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి సత్వర సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చొరవచూపాలన్నారు.

శ్మశానవాటిక పేరిట నిధులు స్వాహా

రూ.8.50 లక్షలు ట్రెజరీలో చెల్లింపులు
ఎక్కడ ఖర్చు చేశారో తేలని వైనం
పొంతన కుదరని లెక్కలు
దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధి శూన్యం
సరైన రికార్డులు, స్థలానికి రక్షణ కరువు

గొల్లగుంట శ్మశాన వాటిక

ప్రజాశక్తి - పరవాడ

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని గొల్లగుంట శ్మశానవాటిక పేరుతో కొందరు ప్రజల సొమ్ము కాజేశారు. ప్రభుత్వ నిధులు పక్కదారిపట్టాయి. అక్రమార్కులకు అధికార అండదండలు ఉండటంతో నిధుల దుర్వినియోగం పూర్తిస్థాయిలో వెలుగులోకి రావడం లేదు. గ్రామ పంచాయతీలో ఖర్చులకు సంబంధించిన ఎం.బుక్ తదితర రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

మండలంలోని రావాడ పంచాయతీ గొల్లగుంట గ్రామానికి చెందిన శ్మశానవాటిక అచ్యుతాపురం మండలం నునపర్తి పంచాయతీ నడింపల్లి రెవెన్యూ పరిధిలో ఉంది. ఈ శ్మశానవాటిక ఎంతో పురాతనమైనది. సుమారు 300 ఏళ్ళ నాటి సమాధులను నేటికీ ఇక్కడ చూడొచ్చు. ఆ గ్రామంలో ఎవరు చనిపోయినా అదే ప్రాంతంలో ఖననం చేస్తుంటారు. ఇంత పురాతనమైన శ్మశానవాటికకు గ్రామ పంచాయతీ తరపున ప్రభుత్వ నిధులు రూ.లక్షల్లో ఖర్చు చేసినట్లు ఉన్నా.. ఆ తీరున అభివృద్ధి కానరావడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్మశానవాటికలకు రక్షణ కల్పించి, అభివృద్ధి చేయాలని నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2008 అక్టోబర్ 25న జిఒ ఎంఎస్ 1235ని, 2009 జులై 16న జిఒ నెంబర్ 715ను తీసుకొచ్చి స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అవేవీ ఇక్కడ కానరావడం లేదు. ఇటు పాలకులు, అటు అధికారుల నిర్లక్ష్యం గొల్లగుంట గ్రామ ప్రజలకు శాపంలా మారింది. ఇటీవల దాతల సహకారంతో శ్మశానవాటిక చుట్టూ పెన్సింగ్ పోల్స్ ఏర్పాటు చేసుకుంటే గుర్తుతెలియని వ్యక్తులు వాటిని ధ్వంసం చేశారు. సంబంధిత స్థలాన్ని ఆక్రమించేందుకే ధ్వంసం చేసి ఉంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఆన్‌లైన్ రికార్డులు ఏం చెబుతున్నాయి..?

రావాడ గ్రామ పంచాయతీ తరుపున లక్షల్లో ప్రభుత్వ నిధులు గొల్లగుంట శ్మశానవాటికకు ఖర్చు చేసినట్లు ఆన్‌లైన్ రికార్డులు చూపిస్తున్నాయి. వాటిని 'ప్రజాశక్తి' పరిశీలించగా రావాడ పంచాయతీ క్యాష్‌బుక్‌లో రెండు సార్లు గొల్లగుంట శ్మశానవాటికకు ఖర్చు చేసినట్లు ఉంది. 2017-18 ఆర్థిక సంవత్సరం నవంబర్‌లో రూ.6 లక్షలా 8 వేలా 59, డిసెంబర్‌లో రూ.2.50 లక్షల నిధులు ఖర్చు చేసినట్లు, ట్రెజరీ నుంచి బిల్లులు చెల్లించినట్లు రికార్డులు ఉన్నాయి. ఇలా పెద్ద మొత్తంలో బిల్లులు పెట్టి దర్జాగా కొంత మంది ప్రభుత్వ నిధులను నాడు స్వాహా చేశారనే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సమాచార హక్కు చట్టంతో వెలుగులోకి వాస్తవాలు

ఈ శ్మశానవాటికకు ప్రభుత్వం ఖర్చు చేసిన నిధుల వివరాలు, రికార్డులను గ్రామానికి చెందిన ఒకరు సమాచార హక్కు చట్టం దరఖాస్తు ద్వారా కోరగా గ్రామ పంచాయతీ, మండల స్థాయి అధికారులు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. గొల్లగుంట శ్మశానవాటిక అచ్యుతాపురం మండలంలో ఉందని రావాడ గ్రామ పంచాయతీ అధికారులు వివరణ ఇవ్వగా, గొల్లగుంట గ్రామానికి ఆనుకుని ఉందని మండల స్థాయి అధికారులు సమాధానం ఇచ్చారు. 2009లో గ్రామ పంచాయతీ నిధుల నుంచి శ్మశానవాటిక వద్ద బోరును నిర్మించినట్లు, దానికిగానూ రూ.37,142 ఖర్చు చేసినట్లు మాత్రమే తెలిపారు. రూ.లక్షలు ఎటుపోయాయో ఎక్కడా తెలపలేదు. కావాలనే నిధులు, ఖర్చుల వివరాలు అధికారులు తొక్కిపెట్టి ఉంటారని పలువురు భావిస్తున్నారు.

అధికారులు ఏమంటున్నారంటే..

శ్మశానవాటికకు 2015 నుంచి 2019 మధ్యలో ప్రభుత్వం తరపున నిధుల ఏమైనా ఖర్చు చేశారా ? అని మండల పంచాయతీ విస్తరణ అధికారి పి.పద్మజను 'ప్రజాశక్తి' వివరణ కోరగా గొల్లగుంట శ్మశాన వాటికకు మట్టి ఫిల్లింగ్ కోసం పంచాయతీ సాధారణ నిధులు రూ.1,61000 ఖర్చు చేసినట్లు 2017 ఎం.బుక్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. గొల్లగుంట శ్మశానవాటికకు రెండు సార్లు నిధులు ఖర్చు చేసినట్లు ట్రెజరీ నుంచి బిల్లుల చెల్లింపులు ఉన్నాయని ఆన్‌లైన్ క్యాష్ బుక్ నకళ్లను 'ప్రజాశక్తి' చూపించగా ఎం.బుక్ లేకుండా బిల్లులు ఏ విధంగా చెల్లింపులు జరిపారో తెలియదని ఆమె వివరణ ఇచ్చారు.

ఇదే విషయమై ఎంపిడిఒ వి.హేమసుందరరావును వివరణ కోరగా ఇది గ్రామ పంచాయతీ పరిధిలోని అంశమని తెలిపారు. దీనిపై విచక్షణాధికారం, విచారణ అధికారం ఇఒపిఆర్‌డికి ఉంటుందని, అవకతవకలపై పంచాయతీ కార్యదర్శి తప్పు చేసినా, సర్పంచ్ తప్పు చేసినా జిల్లా పంచాయతీ అధికారికి చర్యలు తీసుకొనే అధికారం ఉందని తెలిపారు. తాము కూడా విచారణ జరిపించి వాస్తవాలు నిగ్గుతేలితే చర్యల కోసం జిల్లా పంచాయతీ అధికారికి సిఫార్సు చేస్తామని అన్నారు.

జాతీయ స్థాయిలో..

విశాఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ స్థాయిలో విశాఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు సత్తా చాటుతున్నారని విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి డివైఎస్‌వై.శర్మ అన్నారు. శుక్రవారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని ఎంఎస్ఆర్ పిటిఎ టేబుల్ టెన్నిస్ అకాడమీ ఐదో వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అకాడమీ క్రీడాకారులను, శిక్షకులను సన్మానించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకుడు కె.కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్థ స్థాపించిన ఐదేళ్లలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 30 మంది క్రీడాకారులు పాల్గొని విజేతలుగా నిలిచి ప్రతిభ చాటడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. అండర్-11లో జాతియ స్థాయిలో పదో స్థానంలో నిలిచిన వి.హార్దిక్ జయరాం, రెండు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న వి.సంయుక్త అకాడమీకి గర్వకారణమన్నారు. 20 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.

టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రణాళికాయుత బోధనతో ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రణాళిక ప్రకారం పాఠశాలల్లో విద్యా బోధన చేస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చునని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 570 పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయలకు, తల్లిదండ్రులకు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో ఆయన విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 63 మంది విద్యార్థులు 570కిపైగా మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో జిల్లాను మూడో స్థానంలో ఉంచినందుకు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రణాళికతో బోధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. గత ఏడాది విశాఖ జిల్లా ఐదో స్థానంలో నిలవగా, ఈ ఏడాది మూడో స్థానానికి చేరడం గొప్ప విషయమన్నారు. పదో తరగతి తర్వాత ఉన్నత విద్యాభ్యాసం, లక్ష్య సాధనపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలంటే ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ప్రణాళికతో చదవాలన్నారు. విద్యార్థులు మంచి ఫలితాల సాధనలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమన్నారు. నిరుపేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు అభ్యసించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యావ్యవస్థలో చేసిన మార్పులు గొప్ప ఫలితాలు తీసుకువస్తున్నాయన్నారు. నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించామన్నారు. పాస్ పర్సెంటేజ్ తక్కువుగా ఉన్న పాఠశాలలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రణాళికలు సిద్ధం చేసి, వచ్చే విద్యాసంవత్సరం నాటికి శత శాతం పాస్ పర్సెంటేజ్ నమోదయ్యేలా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. సరైన మౌలిక వసతులు, అనుకూలమైన వాతావరణం కల్పించడం వల్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని, అవసరమైన పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు రూ.50 వేలు కేటాయిస్తామని తెలిపారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని డిఇఒను ఆదేశించారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఉత్తమ ప్రతిభ కనబరిచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో జిల్లా కలెక్టర్ తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు.

నేడు సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నటరత్న డాక్టర్ నందమూరి తారక రామారావు శత జయంతోత్సవాల సందర్భంగా ఈ నెల 13న విశాఖ నగరంలో ఎన్‌టిఆర్ చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు డి.భూపతిరావు, ఎం.కృష్ణంరాజు తెలిపారు. ఈ కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్ నివాసంలో ఆయనతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు సన్ మూర్తి, విశాఖ సంగీత కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షులు సిహెచ్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రకృతి ఆధారిత పంటలతో మేలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రకృతి ఆధారిత పంటలతో దేశానికి ఎంతో మేలు జరుగుతుందని ఆంధ్ర యూనివర్సిటీ సోషల్ వర్క్ డిపార్టెమెంట్ హెడ్ ఎస్,హరినాథ్ తెలిపారు. ఈ నెల 14న ప్రపంచ రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోషల్ వర్క్ డిపార్టుమెంట్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులను అందరూ గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అబ్రహం, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం పాల్గొన్నారు.